సాక్షి గుంటూరు

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి మహేష్, ఆదిలక్ష్మి దంపతులు, పార్వతి రూ.3 లక్షలు విరాళం ఇచ్చారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,96,031 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 1,85,403 క్యూసెక్కులు వదులుతున్నారు.



లాంచీస్టేషన్‌కు ఆదాయం

విజయపురి సౌత్: నాగార్జున కొండకు పర్యాటకులు లాంచీలలో వెళ్లడంతో శనివారం రూ. 1,67,350 ఆదాయం వచ్చినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బగళాముఖి అమ్మవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



చందోలు(కర్లపాలెం): చందోలులో ప్రసిద్ధి గాంచిన బగళాముఖి అమ్మవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. తొలుత న్యాయమూర్తికి ఆలయ ఈవో నరసింహమూర్తి, ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పూజా కార్యక్రమాల నిర్వహణ అనంతరం న్యాయమూర్తికి వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో అమ్మవారి ఆలయ విశేషాలను న్యాయమూర్తికి తెలిపారు. న్యాయమూర్తి వెంట బాపట్ల రెండవ అడిషనల్ జడ్జి పి.రాజశేఖర్ పీవీపాలెం ఎంఆర్‌వో డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ. ఎంవీ శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

విజిలెన్స్‌పై అవగాహన ర్యాలీ



కొరిటిపాడు (గుంటూరు వెస్ట్) : విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం వకాలత్ కార్యక్రమం నిర్వహించారు. బ్రాడీపేట నుంచి లాడ్జి సెంటర్ వరకు 200 మంది బ్యాంకు సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. విజిలెన్స్ మన భాగస్వామ్య బాధ్యత అని నినాదాలు చేశారు. బ్యాంకు చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్ రెడ్డి పాల్గొని విజిలెన్స్ అవగాహన వారంపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏసీవీవో వివేక్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ప్రజలలో విజిలెన్స్‌పై అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీజీఎం వికాస్ వినీత్, బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఆఫీసర్ హరీష్ బేతా, జనరల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వెలుగు లఘు చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



తెనాలి: అమృత భాష అయిన తెలుగును మృతభాషగా మిగిలిపోరాదనే భావనతో మన భాష ఔన్నత్యాన్ని తెలియజేసేలా 'తెలుగు వెలుగు' లఘు చిత్రం రూపొందించినట్టు స్వరలయ స్టూడియోస్ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు చెప్పారు. తెనాలి మారీసుపేటలోని స్వరలయ వేదిక కార్యాలయంలో శనివారం ఉదయం విలేకరుల సమావేశంలో స్వరలయ స్టూడియోస్ బ్యానర్ పై నిర్మించిన లఘు చిత్రం 'తెలుగు వెలుగు' లోగోను ఆవిష్కరించారు. సమాజ చైతన్యానికి, కుటుంబ సమేతంగా చూడదగిన లఘు చిత్రాలను మాత్రమే తీస్తున్నామని గుర్తుచేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంతర్జాలంలో అందుబాటులో ఉంటుందని వివరించారు..నటులు హేమంత్, మాస్టర్ కిరణ్ తేజ, దర్శకులు ధనుష్, సాయి లక్కరాజు పాల్గొన్నారు.

బతకమ్మ అమ్మవారి ఊరేగింపు



తెనాలి: మారీసుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర దేవస్థానంలోని బతకమ్మ ఉత్సవ మహిళా సంఘం ఆధ్వర్యంలో బతకమ్మ అమ్మవారి పూజలు ముగిశాయి. గత నెల 22వ తేదీన ఆరంభమైన పూజల్లో ప్రతిరోజూ బతకమ్మకు వివిధ అలంకారాలు చేశారు. లలితా సహస్రనామ పారాయణ చేశారు. చివరి రోజైన శనివారం అమ్మవారి ఓలలాడింపు (ఊరేగింపు)ను ఘనంగా జరుపుకున్నారు. తీర్థప్రసాద వితరణ చేశారు. సంఘం అధ్యక్షురాలు గ్రంధి గిరిజారాణి, కార్యదర్శి వరదా వెంకట విజయలక్ష్మి, కోశాధికారి గుండా వెంకట రత్నకుమారి, ఉపాధ్యక్షులు పొన్నూరు శివనాగలక్ష్మి పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బొక్కేస్తున్న పచ్చ బ్యాచ్!

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి నేరుగా కృష్ణపట్నం పోర్టుకు పేదల బియ్యం అక్రమ రవాణా

- టీడీపీ నాయకుల కనుసన్నల్లో రేషన్ మాఫియా
- అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న డీలర్లు
- అర్ధరాత్రి యథేచ్ఛగా అక్రమ రవాణా
- షాడో ఎమ్మెల్యేల కనుసన్నల్లో కార్యకలాపాలు
- బియ్యం పట్టుకుంటే ఎమ్మెల్యే అనుచరుల నుంచి ఫోన్లు
- పేదల నోటి దగ్గర కూడూ లాక్కుంటున్న నేతలు
- ప్రేక్షక పాత్రకే పరిమితమైన అధికారులు



పొన్నూరులో అధికారులకు చిక్కిన రేషన్ బియ్యం బస్తాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. మాముళ్లు అందుతుండడంతో కూటమి ఎమ్మెల్యేలు కొమ్ము కాస్తున్నారు. బాపట్ల జిల్లా నుంచి తరలిపోతున్న రేషన్ బియ్యం ఒక్క రోజులోనే పొన్నూరు, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో వెయ్యి బస్తాలు పట్టుబడిందంటే ఈ దందా స్థాయి అర్థం చేసుకోవచ్చు. మాఫియాలోని వర్గాల సమాచారంతో ఇవి పట్టుబడ్డాయని, లేకుంటే కృష్ణపట్నం పోర్టుకు తరలిపోయేవని తెలుస్తోంది.

బాపట్ల జిల్లాలో

వేమూరు నియోజకవర్గంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో ఎమ్మెల్యే అనుచరుల ఆధ్వర్యంలో దందా కొనసాగుతోంది. ప్రజల నుంచి రూ.10కే బియ్యం కొనుగోలు చేసి చుండూరు మండలం నడిగడ్డవారిపాలెం రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. పాలీష్ చేసి నేరుగా కృష్ణపట్నం పోర్టుకు తీసుకెళుతున్నారు. భట్టిప్రోలు నుంచి తరలిస్తున్న బియ్యాన్ని గురువారం పొన్నూరులో 300 బస్తాలు పట్టుకున్నారు.

- రేపల్లె నియోజకవర్గంలో డీలర్లు కిలో రూ.10 చొప్పున కొని కూటమి నాయకులకు రూ. 11 నుంచి రూ.12 వరకు అమ్ముతున్నారు. తర్వాత ప్రకాశం జిల్లాకు తర లిస్తున్నారు. ఆపై రూ.16కు విక్రయిస్తున్నట్లు సమాచారం. నిజాంపట్నం మండలం కొలసానివారిపాలెంకు చెందిన కూటమి నేత కీలకంగా ఉన్నాడు. ప్రతి నెలా ఎమ్మెల్యేకు పెద్ద మొత్తం అందుతున్నట్లు తెలుస్తోంది.
- బాపట్ల నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఈనగంటి గాంధీ, వక్కలగడ్డ సుధీర్ రేషన్ ఈ వ్యాపారం చేస్తున్నారు. బాపట్ల నుంచి తరలిస్తున్న 700 బస్తాల బియ్యం శుక్రవారం నాగులుప్పలపాడులో పట్టుబడిన సంగతి తెలిసిందే.

పల్నాడు జిల్లాలో

పల్నాడు జిల్లాలో కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. సత్తెనపల్లిలో షాడో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. రాత్రి వేళ బొలెరో వాహనాలలో నకరికల్లుకు తరలిస్తున్నారు. ఎమ్మెల్యే ఏమీ తెలియనట్లు నటిస్తున్నారు.

గుంటూరు జిల్లాలో

గుంటూరులోని శ్రీనగర్‌కు చెందిన జనసేన నేత అనిల్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఒకరు డీలర్లతో మాట్లాడి ప్రతినెల బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ కాలనీకి చెందిన నాగేశ్వరరావు మిల్లర్ ద్వారా బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. మోహన్, సుబ్బారావులు కీలకపాత్ర పోషిస్తున్నారు.

- పొన్నూరులో పచ్చ నేతలు ముగ్గురు హవా చాటుతున్నారు. పచ్చ జెండా మోసి అలసిపోయిన ఓ మువ్వగోపాలుడు మండలాన్ని చేజిక్కించుకున్నట్లు సమాచారం. రెండు నెలల క్రితం ఓ ఇంట్లో 70 బస్తాల రేషన్ బియ్యం నిల్వ చేసి పోలీసు రికార్డులకు ఎక్కిన టీడీపీ సానుభూతిపరుడు రబ్బాని ప్రస్తుతం కీలకంగా మారారని సమాచారం. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కేంద్రంగా అక్రమ రవాణా సాగుతోంది.
- తాడికొండ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే ఫిరంగిపురం మండలంలోని టీడీపీ యువ నాయకుడికి దందా అప్పగించారు. మండలాల్లో నేతలకు మామూళ్లు ఇచ్చి నడిపిస్తున్నారు. తాడికొండలో ఇద్దరు రేషన్ డీలర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రత్తిపాడులో కొని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఎమ్మెల్యే అల్లుడు, అనుచరులు దందా నడిపిస్తున్నారు.
- మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో బియ్యం నేరుగా మిల్లుల వద్దకు చేరుస్తున్నారు. పాలీష్ చేసి కిలో రూ. 50 నుంచి రూ.70కి విక్రయిస్తున్నారు. కూటమి నేతల అండతో ఓ టీవీ చానల్ రిపోర్టర్ సోదరుడు రేషన్ దుకాణాలపై పెత్తనం చేస్తున్నట్లు సమాచారం

దాడులు లేవు...!

రేషన్ బియ్యం అక్రమ రవాణా పూర్తిగా అధికార పార్టీ నేతల అండదండలతో సాగుతుండటంతో రెవెన్యూ, పోలీసు, విజిలెన్స్ శాఖల అధికారులు లంచాలు తీసుకుని చోద్యం చూస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన లారీలు, ఆటోలు మాత్రమే పట్టుబడటమే ఇందుకు నిదర్శనం.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పొన్నూరులో మామిళ్ళపల్లి కేంద్రంగా వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. టీడీపీ నాయకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పాలకులు రేషన్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు.

– చింతలపూడి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు మండల అధ్యక్షుడు, గుంటూరు జిల్లా.

నేడు బొప్పూడికి హైకోర్టు సీజే రాక

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నిర్వహించే కార్యక్రమాలకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో పాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు రానున్నట్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆలయాలకు సంబంధించిన నక్షత్ర వనం, రాశి వనం, పంచవటి, నవగ్రహ వనంలో మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు, ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. కృష్ణమోహన్‌తో పాటు జస్టిస్ రవినాథ్ తిహారి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, జస్టిస్ వి. శ్రీనివాస్, జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ వై. లక్ష్మణరావు, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి పాల్గొననున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఎండోమెంట్ కమిషనర్ కె. రామచంద్రమోహన్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి డి.కళ్యాణ చక్రవర్తి ఇతర అధికారులు హాజరవుతారన్నారు. స్వామి వార్ల భూమి 1.20 ఎకరాల్లో నక్షత్రాలు, రాశుల వారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

19న బాపట్ల షాపింగ్ ఫెస్టివల్

బాపట్ల: ఈ నెల 19వ తేదీన బాపట్ల షాపింగ్ ఫెస్టివల్‌ను జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణతో కలసి బాపట్ల, చీరాల ట్రేడర్ల సంఘం ప్రతినిధులతో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్'పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ట్రేడర్ల సంఘాలు సహకరించాలన్నారు. 7వ తేదీన ప్రతి పాఠశాలలోని తరగతి గదిలో 40 నిమిషాలపాటు జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు క్లాస్ నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు.

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఆటో డ్రైవర్లకు సాయం అందజేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుర్గేష్

గుంటూరు వెస్ట్: ఆటో డ్రైవర్లకు అండగా కూటమి సర్కార్ ఉంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద సాయం పంపిణీని పెమ్మసాని, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. జిల్లాలో 13,194 మంది ఖాతాల్లో దాదాపు రూ.20 కోట్లు జమ చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా రవాణా అధికారి సీతారామ్ రెడ్డి, ఏపీ ఇండస్ట్రీస్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీస్ చైర్మన్ మోహన కృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, జనసేన జిల్లా ఇన్‌చార్జి గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాష సేవలో ఉత్తమ గురువులు



నేడు తెనాలిలో గురుపీఠ పురస్కారాల ప్రదానం


తెనాలి: హిందీ ప్రేమీ మండలి మహా విద్యాలయంలో వార్షిక హిందీ ప్రచార గురుపీఠ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం జరగనుంది. గాంధీ జయంతి, బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి గురు దంపతుల గురుపీఠ పురస్కారాలను ఏటా అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున అందజేస్తున్నా ఈసారి అదే రోజున విజయదశమి రావటంతో ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రేమీ మండలిలో ఏర్పాటే సభకు పాలడుగు లక్ష్మణరావు అధ్యక్షత వహిస్తారు. ప్రధాన వక్త రావెల సాంబశివరావు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ఆచార్యులు, రచయిత ప్రొఫెసర్ నారాయణ, కాకినాడకు చెందిన విశ్రాంత హిందీ అధ్యాపకురాలు, రచయిత్రి షేక్ కాశింబీకి గురుపీఠ పురస్కారాలను ప్రదానం చేసి, నగదు బహుమతి అందజేస్తారు.

గురుపీఠ పురస్కార గ్రహీత షేక్ కాసింబీ....



మరో గురుపీఠ పురస్కార గ్రహీత షేక్ కాసింబీ స్వగ్రామం కృష్ణాజిల్లా గుడివాడ. 1953లో జన్మించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ హిందీ, అనంతరం దక్షిణ భారత హిందీ ప్రచారసభ, మద్రాస్‌లో 'రాజేంద్ర యాదవ్ నవలల్లో కథాశిల్పం' అంశంపై ఎంఫిల్ చేశారు. దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా కొంతకాలం చేశాక, కోటగిరిలో నీలగిరి పబ్లిక్‌స్కూల్లో హిందీ పీజీ టీచర్‌గా చేరారు. ఏపీ పీఎస్‌సీ ద్వారా సీనియర్ అకౌంటెంట్‌గా చేశారు. తర్వాత తాడేపల్లిగూడెం, నిడదవోలులో జూనియర్ లెక్చరర్‌గా చేశారు. 2002లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, గణపవరంలో హిందీ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. తర్వాత కాకినాడ డిగ్రీ కాలేజీలో ఉద్యోగ విరమణ చేశారు. వీరు అనేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్రసమర్పణ చేశారు. మరో వైపు రచయిత్రిగా 'ఫీనిక్స్' కవిత్వ సంకలనం తెచ్చారు. నాలుగు వ్యాస సంకలనాలను తీసుకొచ్చారు. పలు ఆకాశవాణి కార్యక్రమాల్లో హిందీ కవితలు, కథలు, నాటకాలు, జోక్స్ రాశారు. తెలుగులోనూ రచనలు చేశారు. కొన్ని హిందీ, తెలుగు అనువదించారు. తన కృషికి గుర్తింపుగా పలు అవార్డులను స్వీకరించారు.

ప్రొఫెసర్ నారాయణ....



ప్రొఫెసర్ నారాయణ సొంతూరు తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా కోల్హరి గ్రామం. 1977లో జన్మించారు. బీఏ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ (హిందీ), ఎంఫిల్ చేశారు. హిందీలో 'దళిత సాహిత్యంలో వివిధ కోణాలు' అనే అంశంపై కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ చేశారు. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలంలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 2019లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం హిందీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షులుగా, హిందీ విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతల్లో ఉన్నారు. వీరి మార్గదర్శనంలో నలుగురు పీహెచ్‌డీ, ఇద్దరు ఎంఫిల్ చేశారు. మరో పది మంది పీహెచ్‌డీ పరిశోధన చేస్తున్నారు. శ్రీసద్గురు మళయాళస్వామి, శ్యామశాస్త్రి, యమునాచార్య పుస్తకాలను రచించారు. 51 పరిశోధన పత్రాలు, రెండు కథలు, 51 వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వేర్వేరు గ్రంథాలకు ఏడు అధ్యాయాలను సమకూర్చారు. 84 సెమినార్లలో పత్ర సమర్పణ చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం పత్రిక నవాంకుర్, గ్లోబల్ ఎన్‌సైక్లోపిడియా ఆఫ్ రామాయణకు సంపాదకులుగా, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్, ఏపీకి హిందీ విషయ నిపుణులుగా వ్యవహరించారు. పలు విశ్వవిద్యాలయాలు, కాలేజీల విద్యా కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. 2017లో రష్యా-భారత్ సంయుక్తంగా ప్రదానం చేసిన ఫ్రెండ్‌షిప్ అవార్డుతో సహా పలు పురస్కారాలను అందుకున్నారు.

కృష్ణమ్మ ఒడిలో కన్నీటి సుడులు



రామాపురం మత్స్యకారుల ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

- వరద వస్తే ఇళ్లన్నీ మునక...
- రామాపురం మత్స్యకారుల కాలనీకి పెను ప్రమాదం
- ఏటా వరద నీటిలో మునుగుతున్న మత్స్యకారుల ఇళ్లు
- అప్పట్లో మత్స్యకారులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

దాచేపల్లి : కృష్ణమ్మ ఒడిలో మత్స్యకారులకు కన్నీళ్ల సుడులు తిరుగుతున్నాయి. దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల కాలనీకి ఏటా వరద ముప్పు తప్పటం లేదు. కృష్ణా నది వరద కాలనీలోకి చేరి ఇళ్లను ముంచెత్తుతోంది. దీంతో మత్స్యకారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు.

వరద నీటితో పెను ముప్పు

ఈ కాలనీలో 45 కుటుంబాలు ఉంటున్నాయి. వీరంతా గత 60 ఏళ్ల క్రితం తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. కృష్ణానది ఒడ్డునే ఇళ్లు కట్టుకుని నదిలో చేపలు పట్టుకుని జీవనం సాగించటం వీరి వృత్తి. నది ఒడ్డునే మత్స్యకారుల నివాస గృహాలు ఉండటం వల్ల వరద పెరిగిన ప్రతిసారీ ప్రమాదమే. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల చేయటం.. మూసీ నదిలో వరద నీటి ప్రవాహం పెరగటం వల్ల కాలనీలోకి వరద నీరు భారీగా చేరుతుంది. ఇళ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండగా కొన్ని సందర్భాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్నారు. వరద నీరు తగ్గేవరకు చేపల వేటకు వెళ్లకుండా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల చదువులకు ఆటంకం కలుగుతోంది. పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయి.

మత్స్యకారులకు అండగా వైఎస్సార్ సీపీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలిచింది. వరదలు వచ్చిన ప్రతిసారీ ముందస్తుగానే పునరావాస కేంద్రానికి తరలించేవారు. వరద నీరు తగ్గే వరకు వారికి అన్ని రకాల వసతులు కల్పించారు. పంట నష్టానికి పరిహారం ఇప్పించారు. మత్స్యకారులకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించేందుకు అప్పటి గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ఆ ప్రక్రియ నిలిచింది.

తాగునీటి ప్లాంట్‌పైనా 'పచ్చ' పైత్యం

మాదల(ముప్పాళ్ళ): వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన వారిని భయపెడుతూ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తూ తమ వైపు తిప్పుకొనేందుకు పచ్చపార్టీ నేతలు చర్యలు ప్రారంభించారు. ఎంపీపీ పదవి కోసం వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన అభ్యర్థులను ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు సైతం వెనుకాడటం లేదు.శ్రీకృష్ణ సేవా సమితి పేరుతో గ్రామంలోని బీసీ ఏరియాలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ గోగుల అంజిబాబు కుటుంబసభ్యులు 2011 నుంచి వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నారు. అసలు టీడీపీ ఎంపీటీసీలే లేని మండల పరిషత్ కార్యవర్గంలో ఎంపీపీ పదవిపై కన్నేసి, పార్టీ మారాలంటూ ఎంపీటీసీపై ఒత్తిడి చేశారు. పలు రకాలుగా ఇబ్బందులు పెట్టినప్పటికీ, వారి ప్రలోభాలకు లొంగకపోవటంతో ఇలాంటి దుర్మార్గపు చర్యలు తెరతీశారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. అన్ని అనుమతులు ఉన్నా పోలీసులు కూడా టీడీపీ నాయకుల ఆదేశాలను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

రైతుకు వి'పత్తి'

- వర్షాల ధాటికి పంటను ఆశించిన ఎర్ర తెగులు, గులాబీరంగు పురుగు
- పంట ఎదుగుదల లేకపోవడంతో ఐదెకరాల్లో పంట పీకేసిన పత్తి రైతు



పంటను పీకేస్తున్న వృద్ధ రైతు నూనె గణపతి

ప్రత్తిపాడు: ఆ రైతు.. ఆరుగాలం శ్రమించాడు. ఎండనక వాననక ఆశల సాగు చేశాడు. పుడమినే నమ్ముకుని చేను కౌలుకు తీసుకున్నాడు. అరువు చేసి అరక కట్టాడు. కాలం విసురుతున్న విపత్కర పరిస్థితులను దాటుకుంటూ కౌలు భూమిలో పత్తి విత్తనాలను విత్తాడు. కానీ ప్రకృతి మాత్రం వాన రూపంలో వదలకుండా వెంటాడింది. చివరకు పంట తెగుళ్లబారిన పడి, ఎదుగుదల లేకపోవడంతో కన్నీటి పర్యంతమవుతూ సాగు చేసిన పంటను తన చేతులతోనే పీకేసుకోవలసిన వి'పత్తి'ని ఆ వృద్ధ రైతు ఎదుర్కొన్నాడు.

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం వరగానికి చెందిన నూనె గణపతికి ఎకరం భూమి ఉంది. మూడు నెలల కిందట మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం ఐదెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలు పంట పెరుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. పై ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు కూడా పొలంలో రోజుల తరబడి నిలబడటంతో ఉరకెత్తి ఎర్ర తెగులు సోకింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా గులాబీ రంగు పురుగు కూడా పంటను తీవ్రంగా ఆశించింది. దీంతో మొక్క ఎదుగుదల లోపించింది. మూడు నెలలైనా రెండడుగులు కూడా పెరగలేదు. కౌలుకు రూ. లక్ష, వ్యవసాయం చేసేందుకు సుమారు మరో రూ.లక్ష వరకు పెట్టుబడులు అయ్యాయి. గుండె తరుక్కుపోయిన గణపతి పొలంపై ఆశలు వదులుకున్నాడు. బుధవారం ఉదయం కన్నబిడ్డలా సాగు చేసిన పైరును తన చేతులతోనే పీకేశాడు.

క్లుప్తంగా

ఎన్జీ రంగా వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ఐసీఏఆర్, ఏఐఈఈఏ పరీక్షల్లో తమ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు జాతీయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయానికి చెందిన మొత్తం 273 మంది విద్యార్థులు వ్యవసాయం, అనుబంధ విభాగాలలోని పీజీ కార్యక్రమాలకు ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారన్నారు. ఈ విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఉన్న ఐసీఏఆర్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో పీజీ కార్యక్రమాలకు ప్రవేశం పొందడానికి అర్హులని తెలిపారు. తమ విద్యార్థులు విశ్వవిద్యాలయం అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధన వల్ల సాధించిన విజయమని తెలిపారు. పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఏటీబీ ప్రారంభం



లక్ష్మీపురం (గుంటూరువెస్ట్) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఎనీ టైమ్ బ్యాగ్ (ఏటీబీ)యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రాన్ని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ఠ సేన్ శనివారం ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా రూ.10లకే క్లాత్ బ్యాగ్‌ని సులభం పొందవచ్చన్నారు. ప్లాస్టిక్‌ను తగ్గించి క్లాత్ బ్యాగ్‌ను వినియోగించే పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అన్నపూర్ణ కాంప్లెక్స్ ఖాళీ చేయాల్సిందే..!

- స్పష్టం చేసిన ఉన్నత న్యాయస్థానం
- తదుపరి విచారణ 15వ తేదీకి వాయిదా
- కొల్లి శారదా మార్కెట్ బహిరంగ వేలంలో షాపులు దక్కించుకోని వారంతా అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహణ
- హైకోర్టు ఆదేశాలతో డైలమాలో పడిన పాత లీజుదారులు



అన్నపూర్ణ కాంప్లెక్స్ ముందు కూరగాయల లోడుతో వాహనాలు (ఫైల్)

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న నగరపాలక సంస్థకు చెందిన డాక్టర్ కొల్లి శారదా మార్కెట్‌లోని షాపుల లీజు గడువు పూర్తికావడంతో ఆగస్టు 18, 19, 20వ తేదీల్లో బహిరంగ వేలం నిర్వహించారు. ఒక్కో షాపును రూ.లక్షల్లో పాడుకుని దక్కించుకున్నారు. పాత లీజుదారులు పొన్నూరు రోడ్డు(బైపాస్) వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహించుకుంటున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులంతా అన్నపూర్ణ కాంప్లెక్స్‌కు వెళ్లడంతో మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

ఈ నెల 10లోగా ఖాళీ చేయాలని ఆదేశాలు..

మార్కెట్‌లో ఉన్న 81 షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహించగా కార్పొరేషన్‌కు రూ.ఆరు కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. 81 షాపుల్లో 41 షాపులకు సంబంధించి కొత్తగా పాడుకున్న లీజుదారులు కార్పొరేషన్‌కు నాన్ రిఫండబుల్ గుడ్ విల్ చెల్లించారు. ఈ క్రమంలో పాత లీజుదారులు కార్పొరేషన్ అధికారులు తమను అన్యాయంగా ఖాళీ చేయిస్తున్నారని హైకోర్టుకు వెళ్లడంతో కొత్త లీజుదారులు దక్కించుకున్న రేటుతో షాపులను రెండు నెలల పాటు నిర్వహించుకోవాలని ఆదేశించింది. దాని ప్రకారం అధికారులు పాత లీజుదారులకు తెలియజేసినప్పటికీ వారు దానికి కూడా అంగీకరించకుండా అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్దే వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై కొత్త లీజుదారులు ప్రైవేట్‌గా మార్కెట్‌ను నిర్వహించకూడదని, ఇతర తగిన ఆధారాలతో హైకోర్టును ఆశ్రయించగా కోర్టు పాత లీజుదారులకు షాక్ ఇస్తూ అన్నపూర్ణ కాంప్లెక్స్‌ను ఈ నెల 10వ తేదీలోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. దీంతో పాత లీజుదారులు డైలామాలో పడ్డారు.

హైకోర్టు ఉత్తర్వులు ఫాలో అవుతారో లేదో..!

అన్నపూర్ణ కాంప్లెక్స్ ఖాళీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయి. వీరిని ఖాళీ చేయించేందుకు అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే పాత లీజుదారులకు ఎమ్మెల్యే సపోర్ట్, కొత్త లీజుదారులకు మంత్రి సపోర్ట్ ఉందని అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం కావడంతో.. ఎవరికి సపోర్ట్‌గా వ్యవహరిస్తే రాజకీయంగా ఎటువంటి సమస్యలు వస్తాయో అని అధికారులు సందిగ్ధంలో ఉన్నారు.

హైకోర్టు ఆదేశాలను పాటిస్తాం..

హైకోర్టు ఆదేశాల మేరకు అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్నవారికి నోటీసులు జారీ చేస్తున్నాం. ఈ నెల 10వ తేదీలోగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తాం.
– డి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్-1

7న అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను పాఠశాల, జిల్లాస్థాయిలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత విభాగాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 7న పాత బస్టాండ్ సెంటర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని పరీక్షా భవన్‌లో జిల్లాస్థాయిలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 చొప్పున నగదు బహుమతులు, ప్రశంసాపత్రం అందజేస్తామని వివరించారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్య కుమారి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారి

గుంటూరు వెస్ట్: వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశం మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం – 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యకుమారితోపాటు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, శాసన సభ్యులు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ వయో వృద్ధుల సమస్యలను సాధ్యమైనంతవరకు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వృద్ధుల అనుభవాలు చాలా గొప్పవి..

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వారి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ జి. ప్రకాష్ రెడ్డి, డీఆర్‌ఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏడీ దుర్గాబాయి పాల్గొన్నారు.

నేడు 650 మందికి ఉపకార వేతనాల పంపిణీ

తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర



కొరిటెపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, ఏపీ కాట్వా సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 650 మంది పేద విద్యార్థులకు రూ.24.50 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అమలాపురంలోని ముక్తేశ్వరం రోడ్‌లోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 9 గంటకు కార్యక్రమం ప్రారంభమవుతోందన్నారు. తులసి గ్రూప్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు ముఖ్య అతిథిగా హాజరై ఉపకార వేతనాలు వితరణ చేయనున్నట్టు వెల్లడించారు. ఇందులో 331 మంది విద్యార్థులకు రూ.11.84 లక్షలు తులసి సీడ్స్ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన ఎన్టీఆర్ స్టేడియం టెన్నిస్ క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): శ్రీకాళహస్తిలో ఈనెల 7వ తేదీ నుంచి 9 వరకు జరగనున్న ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియంకు చెందిన ఆరుగురు క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులను రేమండ్స్ షో రూమ్ అధినేత టి.అరుణ్ కుమార్, ఏపీ రెరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు, సహస్ర ఆర్థో అండ్ న్యూరో క్లినిక్ అధినేత డాక్టర్ ఎం. శివకుమార్, రక్షిత్, నాంచారయ్యలు అభినందించారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలు...

అండర్–19 బాలుర విభాగంలో కె.విన్సెంట్, ఊరుబంది లలిత్ కుమార్, బాలికల విభాగంలో సాధుర్ల కావ్య హర్షిత, అండర్–17 బాలుర భాగంలో గంటా దిశాంత్, ఇ.జి. హర్షవర్ధన్, అండర్- 14 బాలుర విభాగంలో కుంభ సాయి నాగ కళ్యాణ్‌లు ఎంపికయ్యారు.

మహనీయుల చరిత్రను తెలిపే 'సదాస్మరామి'

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్



పుస్తకావిష్కరణలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలుగు భాషకు, సంస్కృతికి, చరిత్రకు, కళలకు, వన్నెతెచ్చిన మహనీయుల చరిత్రలను సమగ్రంగా, సంగ్రహంగా గ్రంథస్థం చేసి వర్తమాన భవిష్యత్ తరాలకు దిశా నిర్దేశం చేసిన గ్రంథకర్త మండలి బుద్ధప్రసాద్ అభినందనీయులని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రచించగా మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వెలువరించిన సదాస్మరామి పుస్తకావిష్కరణ సభ నగరంపాలెం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మహనీయుల చరిత్రను తెలుసుకునే అవకాశం సదాస్మరామి పుస్తకం ఇస్తుందని పేర్కొన్నారు. పుస్తక రచయిత, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మహనీయుల గురించి రాయడం తన అదృష్టమన్నారు. దాన్ని వెలువరించిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఎం.నాగేశ్వరరావు, న్యాయమూర్తి జగదీశ్వరి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

పాఠశాల విద్య జేడీ శైలజ



నరసరావుపేట ఈస్ట్: మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పాఠశాల విద్య జేడీ పి.శైలజ తెలిపారు. డీఎస్సీ జోన్–3 పరిధిలో పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందని తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా కృషి చేయాలని హితవు పలికారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగేలా బోధన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు విద్యాశాఖ ఏడీ బి.వి.రమణ, ఎంఈఓలు ఎండీ. ఖాసిం, పి.సుధారాణి, ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవిందరాజులు, వి.వెంకట్రావు, ఏఎంఓ పూర్ణచంద్రరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను సర్వ నాశనం చేసిన ప్రభుత్వం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు
- సత్తెనపల్లిలో ఈ నెల 6,7 తేదీల్లో 11వ రాష్ట్ర మహాసభలు



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శివ దుర్గారావు, నాయకులు

సత్తెనపల్లి: చేనేతపై జీఎస్టీ వేసి పరిశ్రమను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు విమర్శించారు. సంఘం 11వ రాష్ట్ర మహాసభలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, వసతి ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. మహాసభల ప్రాంగణం ఆర్సీ వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివదుర్గారావు మాట్లాడుతూ మహాసభల్లో చేనేత రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చిస్తామని తెలిపారు. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు తీసుకోవలసిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. మహాసభల ప్రారంభం రోజు 6వ తేదీన సత్తెనపల్లి పట్టణంలో చేనేత కార్మికుల భారీ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర నలు మూలల నుంచి ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. వసతి ఏర్పాట్లు, మహాసభ జరిగే ప్రాంగణం, ఆర్సీ అన్ని ఇప్పటికే పూర్తయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, కమిటీ సభ్యులు పి. ప్రభాకర్, జి. సుసులోవ్, మల్లాల గురవయ్య, బిట్రా పానకాలు, జి. ఏసురత్నం, ఆవాజ్ సంఘం నాయకులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

గంజాయి కలిగియున్న యువకులు అరెస్ట్

మంగళగిరి టౌన్: గంజాయి కలిగియున్న యువకులను అరెస్ట్ చేసిన ఘటన మంగళగిరి రూరల్‌పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఈగల్ టీమ్ తమ సిబ్బందితో మంగళగిరి రూరల్ పరిధిలోని కురగల్లు, బేతపూడి, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ప్రాంతాల్లో నిఘా పెట్టారు. ఆయా ప్రాంతాల్లో పలువురు యువకులు గంజాయి తీసుకుని వచ్చి మరికొంతమందికి విక్రయిస్తుండగా మెరుపుదాడులు చేసి యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను, వినియోగిస్తున్న మరో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకని వారి వద్ద నుంచి సుమారు 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ఆరుగురు యువకులను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాత్విక్ అనే యువకుడు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి యువకులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగేశ్వరరావు, మరో ఇద్దరిపై చీటింగ్ కేసు

సత్తెనపల్లి: కోర్టు నుంచి సీఎఫ్ఆర్ రావడంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన బిక్కి నాగేశ్వరరావు, మరో ఇద్దరిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం చీటింగ్ కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన బిక్కి నాగేశ్వరరావు అనాథరైజ్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొంది ఎల్ఎల్‌బీ చేశానంటూ చెప్పుకుంటున్నాడు. న్యాయవాదిగా కేసులు వాదిస్తున్నాడని, మేడికొండూరు మండలం వరగాని గ్రామానికి చెందిన అల్లం సీతామహాలక్ష్మి కోర్టును ఆశ్రయించింది. అర్హత లేకుండా నాగేశ్వరరావు ఎల్ఎల్‌బీ పట్టా పొందాడని, ఫేక్ అని తెలిసినప్పటికీ బార్ కౌన్సిల్ సెక్రటరీ పద్మలత, మాజీ సెక్రటరీ రేణుకలు ప్రోత్సహించారని ఆరోపించింది. అటు ప్రభుత్వాన్ని, ఇటు లీగల్ అథారిటీని మోసగించిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో పట్టణ ఎస్ఐ జె.శ్రీనివాసరావు చీటింగ్ కేసు నమోదు చేశారు.


వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చీరాల రూరల్: వేర్వేరు చోట్ల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాలు.. చీరాల రైల్వేస్టేషన్ సమీపంలోని ఫైరాఫీసు గేటు వద్ద శుక్రవారం రాత్రి ఒకరు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల ఉంటాయని, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలానే మరో ఘటనలో వేటపాలెం- చినగంజాం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 40 ఏళ్లు ఉంటాయని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎన్ఎస్ కళింగలో సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

కొమ్మాది: బీచ్ రోడ్డులోని ఐఎన్ఎస్ కళింగలో శనివారం సాయంత్రం ఒక సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరుకు చెందిన బాజీ బాబా సాహిక్ (44) ఇక్కడ డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. సాహిక్ తన వద్దనున్న సర్వీస్ తుపాకీతో గొంతు వద్ద కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆయన ఆత్మహత్యకు గల కారణాలు, ఇతర వివరాలు ఇంకా తెలియరాలేదు. నేవీ అధికారులు ఫిర్యాదు మేరకు సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంరక్షణకు సత్వర ఏర్పాట్లు



బొల్లాపల్లి: జిల్లాలో నీటి సంరక్షణలో భాగంగా భూగర్భ జలాల పెంపునకు శ్రీకారం చుట్టామని డ్వామా పీడీ ఎం.సిద్ధ లింగమూర్తి తెలిపారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులతో శనివారం ఆయన బొల్లాపల్లిని సందర్శించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంక్, పొలంలో నీటి కుంట ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో భూగర్భ జల నీటిమట్టం 8.6 మీటర్లు లోతు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, ఇంకుడు గుంతలు, పొలాల్లో నీటి కుంటలు, ఫీడర్ చానల్స్ ఏర్పాటుకు పనులను చేపడతామని చెప్పారు. జిల్లాలో వెల్దుర్తి , బొల్లాపల్లి, మాచర్ల, మాచవరం, దాచేపల్లి, దుర్గి, యడ్లపాడుతో పాటు మరో మండలంలో భూగర్భ జలాలు లోతుగా ఉన్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లో నీటి సంరక్షణ కోసం సత్వరమే ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాస్థాయిలో 6.01 లక్షల లబ్ధిదారులు ఉన్నారని, వీరిలో 5.18 లక్షల మంది పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారని వివరించారు. వీరందరికీ ఈకేవైసీ ఉంటేనే పనులు కల్పిస్తామని, ఎన్ఎంఎంఎస్ ప్రత్యేక యాప్ ద్వారా హాజరు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఈకేవైసీ పూర్తి కావచ్చిందని చెప్పారు. 2025 జూలై 15 వరకు ఉపాధి హామీ పథకంలో కూలీలకు చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు.

వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపు

చిలకలూరిపేట: వ్యవసాయ పనిముట్లు, ఎరువుల ధరలపై జీఎస్టీ తగ్గించిన విషయాన్ని రైతులు గుర్తించాలని జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ చెప్పారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రచార కార్యక్రమాన్ని కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించారు. ముందుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ విడిభాగాలపై గతంలో ఉండే 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. ఈ విషయాలపై రైతులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. అనంతరం గణపవరంలో జీఎస్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి, సిబ్బంది చరణ్, సునీల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాసరావు, ఆడిటర్లు టీవైవీఎల్ఎన్ మూర్తి, సామా శ్రీనివాసరావు, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురికిపూడి ప్రసాద్, రవినాయక్ పాల్గొన్నారు.